
Sunday SPECIAL

సజీవ శిల్పం

కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం







'శిలలపై శిల్పాలు చెక్కినారు.. మనవారు సృష్టికే అందాలు తెచ్చినారు..' అని ఓ సినీ గేయ రచయిత అలనాటి తెలుగువారి శిల్ప కళా వైభవాన్ని చాటి చెప్పారు. మొక్కవోని దీక్షతో శిలను శిల్పంగా మలిచి.. ప్రపంచానికి అందించేందుకు శిల్పులు చేసిన కృషికి యునెస్కో గుర్తింపు పొందిన మన రామప్ప శిల్ప సౌందర్యమే నిదర్శనం. అంతేకాదు అనేక చరిత్రాత్మక కట్టడాలను నిర్మించిన కాకతీయుల కాలంలో శిల్పం నాట్యమాడగా.. శిల నుంచి స్వరాగాలు పలికాయట. అలాంటి అద్భుత శిలా సంపద, కళాఖండాలపై కాలక్రమంలో ప్రకృతితో పాటు దుండగులు జరిపిన దాడులతో చాలా చోట్ల ధ్వంసమైంది. రాష్ట్రంలోని ముఖ్యంగా ఓరుగల్లులోని పురాతన దేవాలయాలు, ప్రదేశాలను సందర్శిస్తే.. కొన్ని శిల్పాలు దెబ్బతిన్నట్టు.. లేదంటే వాటి అసలు ఆకృతిని కోల్పోయినట్టు అర్థమవుతుంది. అలాంటి శిల్పాల పాత రూపం చెక్కుచెదరకుండా అసలు అకృతిని ఇచ్చేందుకు చరిత్ర పరిశోధకులు శిల్పాల పునరుజ్జీవానికి శ్రీకారం చుట్టారు. చారిత్రక సంపదను యథాతథంగా ఆవిష్కరింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

- దెబ్బతిన్న శిల్పాల ఆకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ
- వారసత్వ కట్టడాల్లో 4వేలకుపైగా కళాఖండాలు.. వీటిలో 100 శిల్పాలకు జీవం
- రామప్ప, వరంగల్ కోట తదితర ప్రాంతాల నుంచి సేకరణ
- చరిత్రను భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో అడుగులు
- కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు
- జగదల్పూర్ రాజమహల్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు

7

ఎంజీఎం ఘటనపై ప్రభుత్వం సీరియస్



- సీఎం కార్యాలయం నుంచి ఆరా
- ఘటన నిగ్గు తేల్చేందుకు ఐదు పోలీసు బృందాల ఏర్పాటు
- ఆసుపత్రిలో 40 సీసీ కెమెరాల ఏర్పాటు
- పది కుక్కలను పట్టి తరలించిన బల్దియా సిబ్బంది

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం ఓ నవజాత శిశువు మృతదేహాన్ని ఓ శునకం ఆసుపత్రిలోని క్యాజువాలిటీ వార్డు వద్దకు తీసుకొచ్చిన సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఘటనకు గల కారణాలపై సీఎం కార్యాలయ అధికారులు ఆరా తీశారు. అలాగే రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా వరంగల్ కలెక్టర్ సత్యశారద, జిల్లా వైద్య శాఖ, ఎంజీఎం ఆసుపత్రి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇకపై ఎంజీఎం ఆసుపత్రిలో ఇలాంటి ఘటనలు పునరావృతంకానీయొద్దని, వెంటనే పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అప్రమత్తమైన కలెక్టర్ సత్యశారద.. వెంటనే ఎంజీఎం ఆస్పత్రిలో రూ.5లక్షల వ్యయంతో 40సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే రంగంలోకి దిగిన బల్దియా సిబ్బంది.. శనివారం ఉదయం ఎంజీఎం ప్రాంగణంలో సంచరిస్తున్న పది కుక్క లను పట్టి అక్కడి నుంచి తరలించారు. ఇక ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ ఎస్ఎన్‌సీయూ, పిల్లల వార్డును శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

ఐదు పోలీసు బృందాల ఏర్పాటు

మృతిచెందిన నవజాత శిశువుకు సంబంధించిన వారి ఆచూకీని కనుగొనేందుకు పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకోసం ఐదు బృందాలను ఏర్పాటు చేశామని మట్టెవాడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. ఈ బృందాలు హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులను సందర్శించి వివరాలు సేకరిస్తాయన్నారు. గత రెండు రోజులుగా ఎవరైనా శిశువు మృతి చెందారా అన్న అంశంపై కూడా ఆరా తీస్తున్నామన్నారు. కుక్క తీసుకొచ్చిన నవజాత శిశువు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారని, మూడు రోజుల వరకు బంధువుల ఆచూకీ లభించకపోతే తదుపరి కార్యక్రమాలు నిర్వహిస్తామని పోలీసులు తెలిపారు.

ఎంజీఎం సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

పసికందును కుక్క నోటకరుచుకొచ్చిన సంఘటనపై బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో ఎంజీఎం సెంటరులో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ పసిపాప మృతి ఘటన చాలా బాధాకరమని, ఎంజీఎంలో మౌలిక సదుపాయాలపై శ్రద్ధ చూపకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. ఈ సంఘటన ఎంజీఎంలోనే జరిగినా.. ఇది ఎంజీఎం ఆస్పత్రిలో జరగలేదని దాట వేస్తున్న సూపరింటెండెంట్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కూడా వెంటనే సౌకర్యాలు కల్పించి సేవలు ప్రారంభించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను మరమ్మతు చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వాన షమీమ్ మసూద్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, మాజీ కార్పొరేటర్లు కుందారపు రాజేందర్, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జిలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంజీఎం సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్, బీఆర్ఎస్ నాయకులు

పసికందు ఘటన కలిచివేసింది : మంత్రి సురేఖ

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో పసికందుపై వీధి కుక్కల దాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీఎం ప్రాంగణంలో ఈ ఘటన జరగడం అత్యంత బాధాకరమని, పసికందును ఎక్కడి నుంచి కుక్కలు తీసుకొచ్చాయో విచారించాలని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అప్రమత్తంగా ఉంటూ ఇలాంటి ఘటనలు జరగకుండా నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా చుట్టుపక్కల సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులు, బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను మంత్రి కొండా సురేఖ ఆదేశించారు.

బావిలోపడి రిటైర్డ్ ఆర్ఎస్ఐ మృతి

మోటార్ వేసేందుకు వెళ్తూ ప్రమాదం...

కదారిగూడెంలో విషాదం



వెంకట్రెడ్డి (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 10: వ్యవసాయ బావి మోటార్ వేసేందుకు వెళ్లి, ప్రమాదవశాత్తు బావిలోపడి రిటైర్డ్ ఆర్ఎస్ఐ మృతిచెందిన ఘటన శనివారం కదారిగూడెం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కదారిగూడెం గ్రామానికి చెందిన వంగా చెల్మారెడ్డి(65)కి గ్రామంలోని చెరువు సమీపంలో ఐదు ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉంది. ఏఆర్ విభాగంలో పోలీసు వృత్తిలో చేరి, ఆర్ఎస్ఐగా ప్రమోషన్ వచ్చిన తర్వాత నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలో విధులు నిర్వహిస్తూ మూడేళ్ల క్రితం రిటైర్డ్ అయ్యారు. తర్వాత భార్య పద్మతో కలిసి గ్రామంలో నూతనంగా ఇంటిని నిర్మించుకుని తన వ్యవసాయ క్షేత్రంలో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా, కూలీక సద్ది ఇచ్చేందుకు శనివారం వెళ్లాడు. ఈ తరుణంలో మోటారు వేసేందుకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు పైపు తగిలి బావిలో పడిపోయాడు. గతంలో బావి లోపల మోటారు బిగించేందుకు ఏర్పాటు చేసిన పైపులను (బావిలో ఏర్పాటు చేసే కర్ర)పై నేరుగా పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కూలీలు వెంటనే గ్రామస్తులకు విషయం చెప్పగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. వర్ధన్నపేట ఆదనపు ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, రెస్క్యూ టీంలు తాళ్ల సాయంతో మృతదేహాన్ని బయట తీశారు. భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు రెవెన్యూ ముసాయిదా బిల్లుపై చర్చా

వరంగల్ సిటీ, ఆగస్టు 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిపాదించిన నూతన రెవెన్యూ (ఆర్‌వోఆర్2024) ముసాయిదా బిల్లుపై తెలంగాణ తహసీల్దార్ల సంఘం(టీజీటీఏ)ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, ప్రధాన కార్యదర్శి పాక రమేష్ పాల్గొననున్నారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా బిల్లుపై చర్చించి రైతులు, పట్టాదారులకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో ఈ చర్చ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు ప్రాణాలను బలిగొన్న టిప్పర్

- మల్లికుదుర్లలో విషాదం

దర్గసాగర్, ఆగస్టు 10: టిప్పర్ అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన ధర్మసాగర్ మండలం జానకీపురం ఎస్సీ కాలనీ వద్ద శనివారం జరిగింది. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. వేలేరు మండలం మల్లికుదుర్లకు చెందిన గుర్రాల మల్లారెడ్డి (56), అదే గ్రామానికి చెందిన సారాబెల్లి అమరేందర్‌రెడ్డి (40)లు ద్విచక్ర వాహనంపై మల్లికుదుర్ల నుంచి మధ్యాహ్నం 12గంటల సమయంలో ధర్మసాగర్ వైపు బయలుదేరారు. ఈ క్రమంలో ధర్మసాగర్ మండలం జానకీపురం ఎస్సీ కాలనీ వద్దకు రాగానే ధర్మసాగర్ వైపు నుంచి మల్లికుదుర్ల వైపు అతివేగంతో వస్తున్న టిప్పర్ ద్విచక్రవాహనా న్ని ఢీకొట్టడంతో మల్లారెడ్డి, అమరేందర్ రెడ్డి అక్కడి కక్కడే మృతి చెందారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో మల్లికుదుర్లలో విషాదం నెలకొంది. మల్లారెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉండగా, అమరేందర్‌రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాలను పోస్టుమార్టంకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్లారెడ్డి (ఫైల్)



అమరేందర్ రెడ్డి(ఫైల్)

₹10 నాణెంపై అనాసక్తి!

తీసుకోనేందుకు ఇష్టపడని జనం
ఖాతా ఉంటేనే నాణేలు తీసుకుంటున్న బ్యాంకులు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 10: జిల్లాలో పది రూపాయల నాణేలను చాలామంది తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించిన పది రూపాయల నాణేలు దేశ వ్యాప్తం గా చలామణిలో ఉన్నాయని ప్రకటించినా చాలామంది అవగాహన లేక తీసుకోవడం లేదు. ప్రజల సౌకర్యార్థం పది రూపాయల నోట్ల స్థానంలో నాణేలను అందుబాటులోకి తీసుకురాగా కొత్త లో వివిధగా చలామణి అయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పది రూపాయల నాణేలను చిల్లర వ్యాపారులు తీసుకోవడానికి నిరాకరిస్తున్నారు. కేవలం రైల్వే స్టేషన్లలో రైలు టికెట్ తీసుకోవడానికి చిల్లర అవసరం ఉండటంతో అక్కడ పది రూపాయల నాణేలను తీసుకుంటున్నారు. మిగతా ఎక్కడా కూడా నాణేలను తీసుకోవడం లేదు.



బ్యాంకులో అకౌంట్ ఉంటేనే..

రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు ప్రభుత్వ బ్యాంకులో అకౌంట్ ఉండి ఆధార్ కార్డుతో వచ్చి 100 నాణేలు (రూ.వేయి) తీసుకుంటున్నారు. ప్రైవేటు బ్యాంకుల్లో వీటిని తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. బ్యాంకుల్లో నాణేలు ఇవ్వడ మేగాని, తీసుకోవడం ఉండడంలేదు.

తగ్గుతున్న రూ.10 నోట్లు

పెద్ద సంఖ్యలో పది రూపాయల నాణేలు పేరుకుపోవడంతో వాటి వినియోగం జరగాలని జిల్లాలో పది రూపాయల నోట్ల చలామణి తగ్గింది. బ్యాంకుల్లో పది రూపాయల నోట్ల కట్టలు ఇవ్వడం లేదు. నాణేల చలామణి కావాలని చెబుతున్నారు. బ్యాంకుల వారు చూస్తున్నారు.

కస్టమర్లు తీసుకోవడం లేదు..

సత్యం, పాన్‌షాప్ యజమాని, వరంగల్



మాది పాన్‌షాప్. కస్టమర్లకు రూ.10 నాణెం ఇస్తే తీసుకోవడం లేదు. కానీ, మాకు ఎవరైనా నాణేలు ఇస్తే తీసుకుంటున్నాం. ప్రభుత్వం నాణేలు తీసుకునేలా నిర్ణయం తీసుకుంటే మాకు కూడా చిల్లర ఇబ్బంది ఉండదు.

పోలీసు అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తా..

మానుకోట ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో చిన్నారి



కొత్తగూడలో సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి భోజనం చేస్తున్న చిన్నారి

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 10 : చదువుకుని పోలీసును అవుతా.. గుడుంబాను నిర్మూలిస్తానని ఓ చిన్నారి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో తెలిపింది. దీంతో.. నీ చదువుకు పోలీసులు సహకరిస్తారని ఎస్పీ ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో శనివారం నిర్వహించిన గుడుంబా బాధితులకు చేయూత కార్యక్రమానికి గంగారం మండలం కోమట్లగూడెం గ్రామానికి చెందిన ఓ వితంతువు తన చిన్నారితో హాజరుకాగా.. ఎస్పీ ఆ చిన్నారితో మాట్లాడారు. పెద్దయ్యాక ఏం అవుతావని ప్రశ్నించారు. చిన్నతనంలో గుడుంబాకు బానిసై నాన్న చనిపోయాడని ఆర్థికభారంతో చదువుకోలేక పోతున్నానని, లేకుంటే చదువుకుని పోలీస్ అయ్యేదాన్ని అని ఆచిన్నారి బదులిచ్చింది. స్పందించిన ఎస్పీనువ్వు చదువుకనేందుకు పోలీసులు సహకరిస్తారని భరోసా ఇచ్చారు. తన పక్కనే కూర్చొబెట్టుకుని భోజనం చేశారు. గుడుంబాతో నాలాంటి పిల్లల చదువు దూరమై భిక్షాటన చేస్తున్నారని ఎస్పీతో చెబుతూ విలపించింది,

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ కోటూరి మానవతారాయ్



మాట్లాడుతున్న కోటూరి మానవతారాయ్

కేయూ క్యాంపస్, ఆగస్టు 10: రాష్ట్రంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీ సంస్థల దోపిడీ నుంచి రక్షించి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కోటూరి మానవతారాయ్ అన్నారు. శనివారం కేయూ క్యాంపస్‌లోని స్కాలర్స్ హాస్టల్ వద్ద నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మానవతారాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో లక్ష 45 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా అవుట్ సోర్సింగ్ సంస్థల చేతుల్లో మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ తక్కువ జీతాలు చెల్లిస్తూ సకాలంలో ఇవ్వడం లేదన్నారు. అవుట్ సోర్సింగ్ సంస్థలను తక్షణమే రద్దు చేసి చట్టబద్ధమైన సంస్థను ఏర్పాటు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన స్వర్ణయుగంలా ఉందన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి రెండు లక్షల కొలువులను భర్తీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీతో అందరూ స్వర్ణయుగం రేవంత్‌రెడ్డి పాలనను భావిస్తున్నారని అన్నారు. జీవో 29 మాజీ సీఎం కేసీఆర్ తెచ్చి ఇప్పుడు మెడికల్ సీట్ల విషయంలో టీఆర్ఎస్ డ్రామాలు చేస్తోందని దుయ్యబట్టారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో యువతకు లాభం జరుగుతోందన్నారు. ఈ సమావేశంలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ సురాసి కృష్ణ, కేయూ పరిశోధక విద్యార్థులు తాళ్ళపల్లి నరేశ్‌గౌడ్, గుండేటి సుమన్, వర్సిటీ నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జి అభిరామ రమేశ్, పల్లె శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట మీదుగా ఇండిపెండెంట్ డే స్పెషల్ రైలు

కాజీపేట, ఆగస్టు 10: ఇండిపెండెంట్ డేను పురస్కరించుకుని కాజీపేట మీదుగా(07069/07070) హైదరాబాద్ - సంత్రగాచి - హైదరాబాద్ స్పెషల్ రైలు నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ఈనెల 14, 15 తేదీల్లో నడిపించనున్నారు. ఈనెల 14, 15వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉదయం 5.30 గంటలకు బయలుదేరి కాజీపేటకు 7.30 గంటలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్, జనగాం, కాజీపేట జంక్షన్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్, పలాస, బుర్హంపూర్, ఖుర్దా, భువనేశ్వర్, కటక్, జైపూర్, కీయోంజార్, భద్రక్, బలసోర్, కరఖ్‌పూర్ స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

25న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 10: రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న హనుకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-9, 19 బాలబాలికల విభాగంలో వేర్వేరుగా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ క్రీడాకారులను సెప్టెంబర్ మొదటి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9059522986 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స'జీవ' శిల్పం!

● కాకతీయుల నాటి కళాసంపదకు పునరుజ్జీవం ● దెబ్బతిన్న శిల్పాల అకృతితో సిమెంట్ విగ్రహాల తయారీ ● కాకతీయుల శిల్ప సౌందర్యాన్ని కాపాడే ప్రయత్నంలో చరిత్ర పరిశోధకులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయుల కాలంలో నిర్మించిన ప్రతీ కట్టడం ఓ అద్భుతమే. అందులో ప్రతీ దేవాలయాల నిర్మాణానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకతే శిల్పం. ఎన్నో ఏళ్ల శ్రమించి శిల్పులు శిలలకు జీవం పోసేలా నిర్మాణం చేశారు. అందులో రామప్ప శిల్ప సౌందర్యం యునెస్కోను కట్టి పడేసింది. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి రామప్పను ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తించింది. కేవలం రామప్పలోని శిల్ప నైపుణ్యతతో పాటు నీటిలో తేలియాడే ఇటుకల తయారీ యునెస్కోను మైమరిపింపజేసింది. ఆలయం చుట్టూ గోడలపై ఉన్న నాట్యకారిణులు, ఏనుగులు, మదనికల విగ్రహాలు రామప్ప ప్రత్యేకత. నల్ల గ్రానైట్ రాయిపై చెక్కిన నాగిని, మద్నిక శిల్పాలు, రంగమండప స్తంభాలు, యాలి, గజకేసరి శిల్పాలు అలనాటి కళకారుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచి యునెస్కో గుర్తింపునకు దోహదపడ్డాయి. కాకతీయుల కాలంలో అనేక దేవాలయాల్లో ఇలాంటి శిల్ప సౌందర్యమే భక్తులను ఆకట్టుకుంటుంది. రామప్పతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యి స్తంభాల దేవాలయం, వరంగల్ కోట, గణపశ్వేరాలయం.. ఇలా అనేక ప్రాంతాల్లో కాకతీయుల కట్టడాలున్నాయి. వీటిలో చాలా వరకు ప్రకృతి వైపరిత్యాలతో పాటు హిందూ దేవాలయాలపై జరిగిన దాడుల్లో అనేక శిల్పాలు దెబ్బతిన్నాయి. కొన్ని శిల్పాలు వాటి అకృతిని పూర్తిగా కోల్పోయాయి. తెలంగాణ సంస్కృతి వైభవాన్ని కాపాడేందుకు చరిత్ర పరిశోధకులు టీమ్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ అండ్ హెరిటేజ్ (టార్చ్) అనే పేరుతో అంతరించి పోతున్న చరిత్రకు జీవం పోసేందుకు కృషి చేస్తున్నారు.

శిల్పాలకు పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో కళావైభవం ఎంత వర్ధిల్లిందో.. శిల్ప సౌందర్యం కూడా అంతే ఆకర్షించింది. అయితే కాకతీయులు నిర్మించిన అనేక ఆలయాల్లోని శిల్పాలు దుండగుల దండయాత్రలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా వాటి అసలు రూపాన్ని కోల్పోయాయి. చరిత్రకు మౌనసాక్ష్యాలుగా నిలిచాయి. టార్చ్ అధ్వర్యంలో కాకతీయ రాజులు పరిపాలించినప్పుడు రూపొందించిన వందకు పైగా ప్రసిద్ధ శిల్పాలను గుర్తించి వాటికి మునుపటి రూపాన్ని తీసుకొచ్చేందుకు గత ఆరు నెలలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. కాకతీయ సామ్రాజ్యంలో దాదాపు 1,600 ప్రదేశాలలో అనేక దేవాలయాలు ఉన్నాయి. ఈవారసత్వ కట్టడాల్లో 4,000కుపైగా శిల్పాలున్నాయి. ఈ ప్రాజెక్టులో అరవింద్, ఈమని శివనాగిరెడ్డి (రిటైర్డ్ ఆర్కియాలజిసిస్ట్), ఏలూరి శేషబ్రహ్మం (ప్రముఖ కళాకారుడు), రఘువీర్ (స్థపతి), రక్షిత్(కళాకారుడు), హిమాన్షి(నృత్యకారిణి) దాదాపు 100పాడైపోయిన శిల్పాలను సేకకరించి స్కెచింగ్ చేసి శిల్పాలను తయారు చేయడం ప్రారంభించింది. వరంగల్ కోట, రామప్ప దేవాలయం, చంద్రవల్లి దేవాలయాలు, నాగులపాడు, కూసుమంచి, ధంతేశ్వరి నుంచి అనేక విగ్రహల నమునాలను సేకరించారు. పునరుజ్జీవ ప్రాజెక్టు కాకతీయ రాజవంశం కాలం నాటి దెబ్బతిన్న శిల్పాలను పునర్నించడం లక్ష్యంగా పెట్టుకుంది. శిల్పాలు దెబ్బతినకుండా ఉంటే ఎలా ఉంటుందో ఊహించాల్సి ఉంటుంది. ఆ కళాఖండాలను గీసి.. సిమెంట్‌లో చెక్కాల్సి ఉంటుంది. ఇలా ఇప్పటివరకు 30శిల్పాలను పూర్తి చేశారు. కాకతీయుల కాలంలో ఒక్కో శిల్పం చెక్కడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టేది. కాకతీయ శిల్పాలు తమ జీవితాంతం వేలాది శిల్పాలను రూపొందించారు. కాకతీయ కట్టడాలపై జరిగిన దాడులలో ఇటువంటి అద్భుతమైన కళాఖండాలు నాశనమయ్యాయి. శిథిలావస్థకు చేరిన శిల్పాల అసలు స్వరూపంపై ఇప్పటివరకు ఎలాంటి పరిశోధనలు జరగలేదు. వీటిని ఇలా నిర్లక్ష్యం చేస్తే ఉన్నవి కూడా కనుమరుగవుతాయని చరిత్ర పరిశోధకుడు అరవింద్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

శిల్పవైభవం భవిష్యత్తు తరాలకు తెలిసేలా

చరిత్రను గుర్తు పెట్టుకోవడానికి శాసనాలు, నాణేలు, పుస్తకాలు, జానపద కథలు లాంటి రాతపూర్వక ఆధారాలు ఉంటాయి. శిల్పాల ద్వారా చరిత్రను చూపించవచ్చని, దెబ్బతిన్న శిల్పాలు అప్పట్లో ఎలా ఉండేవో.. వాటి అసలు అకృతిని ప్రజలకు చూపించాలని లక్ష్యంగా శిల్ప పునరుజ్జీవం కోసం చరిత్ర పరిశోధకులు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో కాకతీయులతో పాటు అనేక మంది రాజులు నిర్మించిన కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి అనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో ఓరుగల్లు శిల్పావైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించేలా పునరుజ్జీవ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా రామప్ప, వరంగల్ కోటలోని అనేక శిల్పాలను గుర్తించారు. వీటి అసలు అకృతి ఉట్టిపడేలా సిమెంట్‌తో విగ్రహలను తయారు చేస్తారు.

ఈ శిల్పాలకే పునరుజ్జీవం..

కాకతీయుల కాలంలో నిర్మించిన విగ్రహలు అనేకం ధ్వంసమయ్యాయి. వీటిలో కొన్నింటి అసలు అకృతితో పునరుజ్జీవం కల్పించేందుకు టార్చ్ బృందం ఎంపిక చేసింది. వీటిలో రామప్ప ఆలయంలో వందలాది నృత్య శిల్పాలు న్నాయి. పేరిణి, కోలాటంతో పాటు ఇతర శిల్పాలు, నాలుగు కాళ్లతో శివప్రియ నృత్య భంగిమ ఉంది. రంగమండపానికి ఆగ్నేయం వైపు చెక్కిన ఈ శిల్పంలో ముగ్గురు మహిళలు నాలుగు కాళ్లతో నాట్యం చేస్తున్నారు. ఈ శిల్పానికి పునరుజ్జీవం కల్పిస్తున్నారు. అలాగే రామప్ప ఆలయంలోని రంగ మంటపంపైన ఉన్న కపాలి రాతిపై మధ్యలో నటరాజ, అష్ట దిక్పాలకులతో కూడిన కళాకృతి ఉంది. దీన్ని కూడా పునరుజ్జీవం కల్పించనున్నారు. వరంగల్ కోటలోని శంభు దేవాలయంలో అరుదైన ముఖలింగంతో ఉంది. నాలుగు దిక్కులకు నాలుగు ముఖాలు చెక్కి ఉంటుంది. వారిని సద్యోజాత, వామదేవ, అఘోర, ఈశాన అని పిలుస్తారు. ఈ లింగాన్ని కూడా నమునా తయారు చేస్తున్నారు. పాలంపేటలోని రామప్ప చెరువు కట్టపై ఉన్న త్రికూట ఆలయ ధ్వజస్థంభం కాల క్రమేణా అరిగిపోయింది. దీనికి కూడా పునరుజ్జీవం తేనున్నారు. వీటితో పాటు 100 శిల్పాలకు జీవం పోయనున్నారు.







శిల్పాలను తయారుచేస్తున్న స్తపతి రఘువీర్



కాకతీయ శిల్ప వైభవాన్ని కాపాడేందుకే..

అరవింద్, టార్చ్, ప్రధాన కార్యదర్శి

కాకతీయుల కాలంలో నిర్మించిన శిల్పాలను పునఃనిర్మించటంతో పాటు సాంస్కృతిక వైభవం, వారసత్వం, కళలను కాపాడేందుకు శిల్పాల పునరుజ్జీవ ప్రక్రియను చేపట్టాం. వారసత్వ కట్టడాల్లో దెబ్బతిన్న 100 శిల్పాలను గుర్తించాం. వీటిలో 30కి పైగా శిల్పాలను పునరుద్ధరించాం. వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ఈ శిల్పాలను ప్రదర్శనకు ఉంచుతాం. ఛత్తీస్‌గఢ్, జగదల్‌పూర్‌లోని కాకతీయుల వారసుడు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ రాజ్‌మహల్‌లో ప్రదర్శించనున్నాం. ఈ మహల్‌ను త్వరలోనే మ్యూజియంగా మార్చి భవిషత్ తరాలకు కాకతీయుల శిల్ప వైభవం, చరిత్రను అందేలా చూస్తున్నాం.





యథావిధిగా నడుస్తున్న రైళ్లు

శాతవాహన, గోల్కొండ, కృష్ణా, పుష్‌పుల్‌తో సహా అన్ని రన్నింగ్

ఈ నెల 5 నుంచి పోయిన రైళ్ల పునరుద్ధరణ

గిర్మాజిపేట, ఆగస్టు 10: విజయవాడ రైల్వేస్టేషన్- విజయవాడ పశ్చిమ క్యాబిన్ మధ్య కొనసాగుతున్న మూడోలైన్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి నిలిచిపోయిన శాతవాహన, గోల్కొండ, కాజీపేట- డోర్నకల్- విజయవాడ పుష్‌పుల్ రైళ్లతో సహా వరంగల్ రాకుండా దారి మళ్లించిన పలు రైళ్లు శనివారం నుంచి యథావిధిగా నడుస్తున్నాయి. సికింద్రాబాద్- విజయవాడ -సికింద్రాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్- గుంటూరు -సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - గుంటూరు- సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు, కాజీపేట- డోర్నకల్- విజయవాడ, విజయవాడ- డోర్నకల్ - కాజీపేట పుష్‌పుల్ రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. వరంగల్ రాకుండా దారిమళ్లించిన ఆదిలాబాద్ -తిరుపతి -ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-తిరుపతి - సికింద్రాబాద్ పద్మావతి, హైదరాబాద్ -చెన్నై సెంట్రల్- హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ -గూడూరు -సికింద్రాబాద్ సింహపురి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లన్నీ శనివారం నుంచి వరంగల్ మీదుగా రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం తిరుపతి నుంచి ఆదిలాబాద్ బయలుదేరిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ విజయవాడ, ఖమ్మం మీదుగా సాయంత్రం 6.10గంటలకు వరంగల్‌కు చేరుకుని ఆదిలాబాద్‌కు బయలుదేరింది. దీంతో 5 రోజుల పాటు విజయవాడ, హైదరాబాద్ వైపు రైళ్ల రాకపోకలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రయాణికులకు ఊరట లభించింది.

సంగెం పీహెచ్‌సీలో అయోమయానికి తెర

ఒకరిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 10: వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో ఒకే పోస్టులో ఇద్దరిని కేటాయిస్తూ వెలువడిన ఉత్తర్వులను రద్దు చేశారు. వైద్య, ఆరోగ్యశాఖలో అయోమయం అనే కథనం ఈ నెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. వరంగల్ జిల్లా సంగెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్‌గా ఎం.హనుమనాయక్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు ఉత్తర్వులు విడుదల చేశారు. మరో పది రోజులకు ఇదే స్థానంలో సదానందంను నియమిస్తున్నట్లు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురాగా సదానందంను గీసుగొండకు బదిలీ చేసినట్లు తాజా ఉత్తర్వులు విడుదల చేశారు.





లూత్రను సన్మానిస్తున్న నాయకులు

సుప్రీంకోర్టు అడ్వకేట్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గీసుగొండ, ఆగస్టు 10: ఎస్సీల వర్గీకరణ కోసం సుప్రీంకోర్టులో వాదించటానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అడ్వకేట్ సిద్దార్థలూత్రను ఎమ్మార్పీఎస్ నాయకులు ఢిల్లీలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇవ్వటంలో సిద్దార్థలూత్ర కీలకపాత్ర పోషించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య తెలిపారు. లూత్రను కలిసిన వారిలో దళితరత్న కేదాసి మోహన్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్‌లు ఉన్నారు.



తిమ్మాపూర్ రైతులతో పొలం బాటలో డీఈ మల్లికార్జున్

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

శంభునిపేట, ఆగస్టు 10 : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ వరంగల్ డీఈ శెంకేశి మల్లికార్జున్ అన్నారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌లో సిబ్బంది రైతులతో సమావేశం నిర్వహించారు. డీఈ మల్లికార్జున్ విద్యుత్ సరఫరా, అంతరాయాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల పనితీరు, రైతులు పొలాల్లో ఏర్పాటు చేసుకున్న కెపాసిటర్ల గురించి సిబ్బంది, రైతులతో చర్చించారు. విద్యుత్ సంబంధిత సమస్యలు వస్తే వెంటనే తమ ప్రాంత లైన్‌మేన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శంభునిపేట ఏడీఈ సోమేశ్వర్, మామునూరు ఏఈ సురేందర్, సబ్ ఇంజనీర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

• వరంగల్ తహసీల్దారు కార్యాలయంలో ఖాళీ పోస్టులు • ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ లేక అవస్థలు
• ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు • మంత్రి, కలెక్టర్ చొరవచూపాలని మండలవాసులు విజ్ఞప్తి

పోచమ్మమైదాన్, ఆగస్టు 10: వరంగల్ తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేకపోవడంతో కులం, నివాసం, ఆదాయ, తదితర ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తు దారులు నిత్యం తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వరంగల్ తహసీల్దారు కార్యాలయ పరిధిలో దేశాయిపేట, లక్ష్మీపురం, మట్టెవాడ, గిర్మాజీపేట, రామన్నపేట, పైడిపెల్లి, కొత్తపేట, ఏనుమాముల ప్రాంతవాసులు రెవెన్యూ సేవల కోసం వస్తుంటారు. సిబ్బంది కొరత, వీఆర్‌ఏ, వీఆర్‌ఓ వ్యవస్థ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జారీ చేయాల్సిన సర్టిఫికెట్లకు నెలల తరబడి సమయం పడుతోందని ప్రజలు వాపోతున్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం ...

మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసిన తర్వాత నిబంధనల ప్రకారం కులం, నివాస ధ్రువీకరణ పత్రాల జారీకి 30రోజులు, ఆదాయ పత్రాల జారీకి ఏడు రోజుల గడువు పడుతుంది. కానీ, సిబ్బంది కొరతతో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. అత్యవసర పరిస్థితుల్లో అవసరం ఉన్న వారు వరంగల్ మండల కార్యాలయంకు వెళ్లి వేడుకుంటే తప్ప పనులు జరగడం లేదని దరఖాస్తు దారులు వాపోతన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, డెత్ ఎంక్వైరీ, ఫ్యామిలీ మెంబర్, ధరణి సమస్యల పరిష్కారం తదితర సర్టిఫికెట్లు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి జారీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సరిపడా సిబ్బంది లేకపోవడం శాపంగా మారింది. సిబ్బంది లేక ఉన్న వారి పైనే పనిభారం పడుతోంది. దీనికి తోడు మంత్రి నియోజకవర్గం కావడంతో అధికారులు ప్రోటోకాల్ బాధ్యతలకు సమయం కేటాయించాల్సి వస్తోంది.

ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ

తహసీల్దారు కార్యాలయంలో ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ) పని చేయాల్సి ఉన్నా, ఒక్కరు రెండేళ్ల క్రితం కలెక్టర్ కార్యాలయంలో సీసీగా వెళ్లారు. పనిభారం మంతా ఉన్న ఒక్క ఆర్ఐపై పడుతోంది. కాగా, ప్రస్తుతం ఆర్ఐ కూడా అనారోగ్యంతో లీవ్‌లో ఉండటంతో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలో పని చేయాల్సిన సీనియర్ అసిస్టెంట్ మధుచంద్ర అడిషనల్ కలెక్టర్ సీసీగా కొనసాగుతున్నారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కూడా లేదన్నమాట, వాచ్‌మెన్ పోస్టు సైతం ఖాళీగానే ఉంది.



వరంగల్ తహసీల్దార్ కార్యాలయం

మంత్రి, కలెక్టర్ దృష్టి సారించేనా..

తహసీల్దారు కార్యాలయంలో సిబ్బంది కొరతపై రాష్ట్ర మంత్రి, తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ, కలెక్టర్ సత్యశారద దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న మండలంలో సిబ్బంది లేకపోవడంపై విమర్శలకు వావిస్తోంది. ఇప్పటికైనా సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు.

ఆల్ ఇండియా కాటన్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్‌కు రవిందర్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌కు హాజరైన రవిందర్ రెడ్డి

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 10: ఈనెల 9, 10 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగిన ఇండియన్ కాటన్ ఫెడరేషన్, ఇండియన్ కాటన్ అసోసియేషన్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా కాటన్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఎక్స్‌పోర్ట్స్, స్పిన్నింగ్ మిల్లర్స్, వ్యాపార ప్రతినిధులు హాజరయ్యారు. గత సంవత్సరం క్రాప్ ఎంత వచ్చింది, కంజంమ్షన్ ఎంతయ్యింది. ఎక్స్‌పోర్ట్స్, ఇన్‌పోర్టు ఎంతైనవి, రాబోయే కాటన్ సీజన్‌లో క్రాప్ అంచనా, సీసీఐ ఎంఎస్‌పీ, పంట ఉత్పత్తులపై చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కక్కిరాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి దోహదపడాలి

సంగెం, ఆగస్టు 10: పద్మశాలీలంతా ఒక్కతాటిపై పనిచేసి వారి అబివృద్ధికి దోహదపడాలని రాష్ట్ర అధ్యక్షుడిగా బరిలో నిలిచిన వల్లెపాటి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం సంగెంలో మండలశాఖ అధ్యక్షుడు కందకట్ల నరహరి అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ సంగెం మండలంలో 630 మంది ఓటర్లుగా పద్మశాలిలు నమోదు చేసుకోన్నారని, రాజధానితోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పద్మశాలి భవనాలను నిర్మించేలా కృషిచేస్తానని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 101 పోలింగ్ కేంద్రాల్లో ఈనెల1 8 ఎన్నికలు జరుగుతాయన్నారు.



అభివాదం చేస్తున్న పద్మశాలీలు

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్నె శరత్‌బాబు, జనగాం జిల్లా అధ్యక్షుడు వేముల బలరాజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చంద మల్లయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్ రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కేడిక్యాల సమ్మయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అడిచెర్ల శ్రీనివాస్, షాద్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గూడ వెంకట స్వామి, మండల నాయకులు బిట్ల సత్యనారాయణ, ఇప్పకాయాల మనోహర్,అనుమాండ్ల రమేష్, చిందం వేరస్వామి, కొంతం వేణు పాల్గొన్నారు.

తిలక్ విగ్రహాన్ని శుభ్రం చేసిన బీజేపీ నాయకులు

వరంగల్ సిటీ, ఆగస్టు 10: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హర్ ఘర్ తిరంగ అభియాన్ పిలుపు మేరకు శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లో బాలగంగాధర్ తిలక్ విగ్రహాన్ని శుభ్రం చేశారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు సముద్రాల పరమేశ్వర్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు మేరకు అమరవీరుల స్మారక చిహ్నాలు, విగ్రహాల వద్ద పుష్పగుచ్చాలుంచి పుష్పాంజలి ఘటించామన్నారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ నోముల రతన్, గాదె భిక్షపతి, గుర్రపు రవి, పెరికాటి హరి, మస్నా దిలీప్, అరికాల రవి పాల్గొన్నారు



తిలక్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

కార్మికుల నైట్ విజిత్‌ను జయప్రదం చేయండి

ఖిలావరంగల్, ఆగస్టు 10: ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 14న, కార్మికుల నైట్ విజిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. శనివారం శివనగరంలోని తమ్మెర భవన్‌లో ఆల్‌ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, 14న తూర్పుకోటలో నైట్ విజిట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను పెట్టుబడిదారులకు యాజమానులకు అనుకూలంగా చట్టాలు చేయడం, భారతీయ నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ ద్వారా పెద్ద కార్పొరేట్లకు ఆర్థిక వెసులుబాటును కల్పించే చర్యలు వేగవంతం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగుల దయాకర్, ఐఎన్‌టీయూ జిల్లా కార్యదర్శి పుల్ల రమేష్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి అకెనపల్లి యాదగిరి, ఏఐటీసీయూ జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్వర్, టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి కుసుమ శ్యామ్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, దామెర కృష్ణ, ఎమ్డీ యాకూబ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు పసునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నేడు పోచమ్మ తల్లికి కుమ్మరుల తొలిబోనం

పోచమ్మమైదాన్, ఆగస్టు 10: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పోచమ్మమైదాన్ సమీపంలోని పోచమ్మ ఆలయంలో ఆనవాయితీగా వస్తున్నట్లు నేడు (ఆదివారం) కుమ్మరులు తొలిబోనం సమర్పించనున్నట్లు పోచమ్మ దేవాలయం కుమ్మరి పూజారుల దేవాలయ భక్తమండల కమిటీ అధ్యక్షుడు ఆకారపు మోహన్ తెలిపారు. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని పోచమ్మ దేవాలయంలో శనివారం కుమ్మరి పూజారుల దేవాలయ భక్తమండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైభవంగా పోచమ్మబోనాలు నిర్వహించనున్నామని తెలిపారు. వేడుకకు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మర్రిపెల్లి రామయ్య, కోశాధికారి ఆకారపు బాస్కర్; సలహాదారు రామన్న, ఆనంద్, చక్రదర్, రమణయ్య, ఎలిగందుల బుచ్చమ్మ, ఆకారపు రాజమ్మ, వకలక్ష్మి, ఇజ్జగిరి సత్తెమ్మ, ఆకారపు శ్రీధర్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తమండల కమిటీ సభ్యులు

సేవాలాల్ ఆలయ నిర్మాణం చేపట్టాలి

సంగెం, ఆగస్టు 10: సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు ప్రకటించాలని తెలంగాణ గిరిజన జనసమితి ప్రధానకార్యదర్శి సపావట్ మహేందర్‌నాయక్ డిమాండ్ చేశారు. సంగెంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు చోటు కలిపించాలని, ప్రతీయేటా తీజ్ పండుగను ప్రభుత్వ ఖర్చులతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బానోత వెంకటేష్‌నాయక్, మూడు సుమన్‌నాయక్, నవీన్‌నాయక్, వినోద్‌నాయక్, సంతోష్‌నాయక్, వెంకన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు



గీసుగొండ సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

పారిశుధ్యం అస్తవ్యస్తం

గీసుగొండ, ఆగస్టు 10: గీసుగొండలో డ్రైనేజీ వ్యవస్థ లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సీసీ డబుల్ రోడ్డు వేసినా, రోడ్డుకు ఇరుపక్కల సైడ్‌బర్మ్ లేకపోవడం, సైడ్‌డ్రైన్స్ నిర్మించకపోవటంతో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గ్రామంలో పలు చోట్ల రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఓ పక్క జిల్లా స్థాయి అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని గ్రామ సచివాలయాలను హెచ్చరిస్తున్నా పట్టించుకోవటం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 10: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి ఆకేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా వనమాల కనపర్తి గ్రామ శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు అండగా సఖీ కేంద్రాలు

గీసుగొండ, ఆగస్టు 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న సఖీ కేంద్రాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయని సఖీ సెంటర్ ప్రతినిధి తిరుమల అన్నారు. మండలంలోని దస్రుతండా, మచ్చాపూర్ గ్రామాల్లో సఖీ సేవలపై మహిళలకు అవగాహన సమావేశాలను శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలిక సంరక్షణ చట్టాలు, న్యాయసహాయం, వైద్యసహాయం, తాత్కాలిక వసతి ఉచితంగా అందించేందుకు 24 గంటలు సఖీ కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. అన్యాయానికి గురయ్యే మహిళలు హెల్ప్‌లైన్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం 181 సేవల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీపీవోలు నిర్మల, అమృత, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మచ్చాపూర్‌లో జరిగిన బాలల రక్షణ చట్టాల సదస్సులో ప్రగతిపాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విజయ్‌కమార్, ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ పాల్గొన్నారు.



181 హెల్ప్‌లైన్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు

ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

శంభునిపేట, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకుడు కర్నె రవీందర్ కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా రంగశాయిపేటలో శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. రవీందర్ మాట్లాడుతూ 13 నుంచి 15 వరకు ప్రతీ ఒక్కరు విధిగా తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్‌ల అధ్యక్షులు తాళ్లపల్లి అర్జున్, బోరిగం నాగరాజు, కర్నె వాసుదేవ్, ఆకుతోట రాజు, నాయకులు బక్కి రంజిత్, ఆరె కార్తిక్ పాల్గొన్నారు.



రంగశాయిపేటలో జాతీయ జెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ఖిలావరంగల్, ఆగస్టు 10: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సునీత అనే మహిళపై జరిగిన పోలీసుల దాడిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం శివనగర్‌లోని రఘునాథ్ భవన్‌లో అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం వరంగల్(ఐద్వా) జిల్లా కమిటీ రంగరాజు విజయ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాద్‌నగర్‌లో సీఐ, పోలీసులు దళిత మహిళ సునీతను దొంగతనం చేసిందంటూ చిత్రహింసలకు గురిచేయడం తగదన్నారు. మహిళా పోలీసులు లేకుండానే సునీతను వివస్త్ర చేసి థర్డ్ డిగ్రీని ప్రయోగించడం దుర్మార్గమైన చర్యఅన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బాధితురాలికి రూ.25లక్షలు, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు బి.సంగీత, టి.భవానీ, ఉదయశ్రీ, మంజుల, వాణి, ఎమ్డీ జరీనా, రాధక్క పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నలిగంటి రత్నమాల, మహిళలు

దళితమోర్చా జిల్లా అధ్యక్షుడిగా మార్టిన్‌లూథర్

ఖిలావరంగల్, ఆగస్టు 10: దళితమోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పోలెపాక మార్టిన్‌లూథర్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటరవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ 18వ, డివిజన్ క్రిస్టియన్‌కాలనీకి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మార్టిన్ లూథర్ రెండోసారి దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మార్టిన్‌లూథర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభావంతో దేశంలో జరుగుత ున్న అభివృద్ధితోపాటు బీజేపీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిధులతో దళితులకు అందేలా తన వంతు కృషి చేస్తామన్నారు. తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎస్సీ మోర్చారాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.



బీజేపీ ఓబీసీ మోర్చా కో ఇన్‌చార్జిగా అనిల్

కరీమాబాద్, ఆగస్టు 10: బీజేపీ ఓబీసీ మోర్చా కరీంనగర్ జిల్లా కో ఇన్‌చార్జిగా కరీమాబాద్‌కు చెందిన గోగికార్ అనిల్ నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

అనిల్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. తనను కరీంనగర్ జిల్లా ఓబీసీ మోర్చా కోఇన్ చార్జిగా నియమించినందుకు గాను ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కోవా లక్ష్మణ్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు ఆనందర్ గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌కు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు.



బుక్‌స్టాల్‌లో రెండోసారి చోరీ

కరీమాబాద్, ఆగస్టు 10: ఫోర్ట్‌రోడ్‌లోని శ్రీనివాస బుక్ స్టాల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి మరోసారి చోరీకి పాల్పడ్డారు. 7న అర్ధరాత్రి ఇదే బుక్‌స్టాల్‌లో షట్టర్ తాళాలు పగులగొట్టి కౌంటర్ లోని రూ. 1.90 లక్షల నగదును అపహరించగా, తాజాగా మరోసారి చోరీ జరిగింది. గురువారం కేసు నమోదు చేసి, విచారణ చేపడుతుండగానే శుక్రవారం అర్ధరాత్రి మరోసారి అదే తరహాలో చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫోరెన్సిక్ బృందంచే వేలిముద్రలు సేకరించారు. కాగా, షాపులో ఎలాంటి నగదు, వస్తువులు అపహరణకు గురికాలేదు. కాగా ఇటీవలే ఇదే ప్రాంతంలోని వజ్ర వైన్స్‌లో చోరీకి పాల్పడిన దుండగులు మరుసటి రోజే శ్రీనివాస బుక్‌స్టాల్‌లో రెండోసారి చోరీకి పాల్పడటంతో పోలీసులకు సవాల్‌గా మారింది.



వేలిముద్రలు సేకరిస్తున్న ఫోరెన్సిక్ సిబ్బంది

గంజాయి విక్రేత అరెస్టు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 10: ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు, త్వరగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం. భూపాలపల్లికి చెందిన గాదె శ్రీనివాస్ అనే వ్యక్తి హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. డిగ్రీ వరకు చదివిన శ్రీనివాస్, ఎలాంటి ఉపాధి లభించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెతత్తాయి. దాంతో ఒరిస్సా బార్డర్ సీలేరు ప్రాంతం నుంచి గంజాయిని అపరిచిత వ్యక్తి ద్వారా తీసుకొచ్చి వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.33,250 విలువైన 1350గ్రాముల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. దాంతో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు.

కేయూ వీసీగా ఎస్టీలకు అవకాశం కల్పించాలి

కేయూ క్యాంపస్, ఆగ స్టు 10: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్సిటీలకు నూతన వైస్ చాన్స్‌లర్ల నియమిస్తున్నారని, ఈ దఫా ఎస్టీ వర్గాలకు చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ట్రైబల్ జేఏసీ జా యింట్ యాక్షన్ కమిటీ కేయూ అధ్యక్షుడు మా నాల తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. శనివారం కేయూ న్యూ పీజీ హాస్టల్‌లో జరిగిన ట్రైబల్ స్టూడెంట్ సమావేశంలో తిరుపతి నాయక్ హాజరై మాట్లాడారు. కేయూలో ఇప్పటివరకు ఓసీ, బీసీ, ఎస్సీ, వర్గాలకు వీసీలుగా పనిచేసే అవకాశం వచ్చిందని ఎస్టీ వర్గాలకు ఇవ్వలేదని అన్నారు. ఈ దఫానైనా ఎస్టీ వర్గాలకు వీసీగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూ గిరిజన సంఘం నాయకులు వినోద్ నాయక్, చరణ్ నాయక్, రాజు, లాల్ సింగ్, నిఖిల్, బహదూర్, ప్రవీణ్, బాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్టీ విద్యార్థి సంఘం నేతలు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 11 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

పీఏసీఎస్ సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్ల సస్పెన్షన్

• 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

నల్లబెల్లి, ఆగస్టు 10 : నల్లబెల్లి పీఏసీఎస్‌లో రైతుల రుణ మాఫీలో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారనే కారణంతో పీఏసీఎస్ సీఈవో నాగెల్లి మొగిళి, కంప్యూటర్ ఆపరేటర్ పైనాల రాజును సస్పెండ్ చేసినట్లుశనివారం డీసీవో సంజీవరెడ్డి తెలిపారు. పీఏసీఎస్‌లో ఎవరైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, ఆంధ్రజ్యోతిలో శనివారం అవినీతికి అడ్డుకట్టేది అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి డీసీవో స్పందించి, ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, నల్లబెల్లి పీఏసీఎస్‌లో జరిగిన రుణమాఫీ అవినీతి, అక్రమాలపై పోలీసు స్టేషన్‌లో బాధిత రైతు కొమ్ము రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సొసైటీ చైర్మన్ చెట్టుపల్లి మురళి, సీఈవో నాగెల్లి మొగిళి, కంప్యూటర్ ఆపరేటర్ పైనాల రాజు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, ఆగస్టు 10 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రూ.3లక్షల సీడీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, గ్రామాలు బాగుంటే దేశం బాగుపడుతుందని అన్నారు. గ్రామాల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, నాయకులు సునీల్‌రావు, గంగాధర్‌రావు, రాంచందర్, పూర్ణచందర్, ఓరుగంటి శ్రీనివాస్, చలపతిరావు, సుధాకర్, కొంరయ్య కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల నూతన భవన నిర్మాణం చేపట్టాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ప్రిన్సిపాల్ వెంకటయ్య

వర్ధన్నపేట, ఆగస్టు 10 : వర్ధన్నపేట కళాశాలకు మంజూరైన నూతన భవన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కళాశాల ప్రిన్సిపాల్ గుళ్ల వెంకటయ్య శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ కళాశాల గేటు వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని, మైక్ సెట్‌ను మంజూరి చేయించాలని కోరారు. ఆయన వెంట అధ్యాపకులు రాజ్‌కుమార్, తిరుపతి ఉన్నారు.

వర్ధన్నపేటలో దొంగల బీభత్సం



పరిశీలిస్తున్న పోలీసులు

వర్ధన్నపేట, ఆగస్టు 10 : పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పట్టణంలోని ఖాళీ వైన్స్ షాపులో షట్టర్ తాళాలు పగులగొట్టి షాపు లోని గల్లా పెట్టెలో ఉన్న రూ.30 వేలతో పాటు మద్యం కాటన్లను ఎత్తుకెళ్లారని బాధి తులు తెలిపారు. అదేవిధంగా ఆటో నగర్‌లో ఉన్న మెకానిక్ షాపులో, ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మెడికల్ షాపులో నగదు, విలువైన వస్తువులు దోచు కెళ్లారు. వైన్స్ షాపులో ఉన్న సీసీ కెమెరా హార్డ్‌డిస్క్‌ను సైతం ఎత్తుకెళ్లారు. శని వారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ నర్సయ్య, ఎస్సైలు ప్రవీణ్ కుమార్, రాజు, పోలీసు సిబ్బందితో వెళ్లి షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ దొంగలను పట్టుకుంటామని చెప్పారు.

రామచంద్రరావు మృతి తీరని లోటు



రామచంద్రరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నర్సంపేట, ఆగస్టు 10 : కమ్యూనిస్టు ఉద్యమనేత, సీపీఐ రాష్ట్రకోశాధికారి రామ చంద్రరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో రాంచంద్రరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ కోసం కృషి చేసిన ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త పాటుపడాలని, ఆయనను ఆదర్శంగా తీసుకొని కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వాములు కావాలని సూచించారు. సీపీఐ నాయకులు అక్కపల్లి రమేశ్, దామర కృష్ణ, గన్నవరం రమేశ్, గడ్డం యాకయ్య, పాలక కవిత, గోవర్ధన్, మియాపురం నాగరాజు, బాదరబోయిన యాదగిరి, అయిత యాకుప మంజుల, యశోద, శ్రీకళ ఉన్నారు.

వయనాడ్ సహాయ నిధికి విరాళాల సేకరణ



విరాళం సేకరిస్తున్న సీపీఎం నాయకులు

దుగ్గొండి, ఆగస్టు 10 : కేరళలోని వయనాడ్‌లో ఇటీవల కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పోయి అపార నష్టం వాటిల్లగా, వారి సహాయార్థం సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో విరాళ సేకరణ చేపట్టారు. గిర్నిబావిలో శనివారం వివిధ షాపులలో విరాళాల సేకరణ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుమారస్వామి, చల్లా నర్సింహా రెడ్డి, పుచ్చకాయల కృష్ణారెడ్డి, కొడెం రమేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

పద్మశాలీల అభివృద్ధికి దోహదపడాలి



అభివాదం చేస్తున్న పద్మశాలీ నాయకులు

సంగెం, ఆగస్టు 10 : పద్మశాలీలంతా ఒక్కతాటిపై పని చేసి వారి అభివృద్ధికి దోహదపడాలని రాష్ట్ర అధ్యక్షుడిగా బరిలో నిలిచిన వల్లెపాటి రాజ్‌కుమార్ అన్నారు. శనివారం సంగెంలో మండల శాఖ అధ్యక్షుడు కందకట్ల నరహరి అధ్యక్షతన సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంగెం మండలంలో 630 మంది ఓటర్లుగా పద్మశాలిలు నమోదు చేసుకొన్నారని, రాజధానితోపాటు అన్ని జిల్లా కేంద్రాల్లో పద్మ శాలి భవనాలను నిర్మించేలా కృషిచేస్తానని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 101 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 18న ఎన్నికలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్నె శరత్‌బాబు, జనగాం జిల్లా అధ్యక్షుడు వేముల బలరాజ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చంద మల్లయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మచ్చ సుధాకర్‌రావు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అధ్యక్షుడు కేడిక్యాల సమ్మయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అడిచెర్ల శ్రీనివాస్, షాద్‌నగర్ జిల్లా అధ్యక్షుడు గూడ వెంకట స్వామి, మండల నాయకులు బిట్ల సత్యనారాయణ, ఇప్పకాయాల మనోహర్, అనుమాండ్ల రమేష్, చిందం వేరస్వామి, కొంతం వేణు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చెరువుల తూములు

మరమ్మతులకు నోచుకోక

వృథాగా పోతున్న సాగు నీరు

ఆందోళనలో రైతులు



ఊర చెరువు తూము ద్వారా వృథాగా పోతున్న నీరు



గుండం చెరువు తూము ద్వారా వృథాగా పాతున్న నీరు



ఊడిపోయిన గుండం చెరువు తూము షెటర్ (ఫైల్)

దుగ్గొండి, ఆగస్టు 10 : శిథిలావస్థలోని చెరువుల తూములు మరమ్మతులకు నోచుకోక, ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లోకి చేరిన నీరు తూముల లీకేజీతో వృథాగా పోతున్నాయి. మండలంలోని అడవి రంగాపురం ఊర చెరువు తూము మరమ్మతులకు నోచుకోక తూము లీకేజీతో సాగు నీరు వృథా అవుతోంది. దీంతో ఆ గ్రామ రైతులు పంటలకు సాగు నీరు అందని దుస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్త పరుస్తున్నారు. అలాగే తిమ్మంపేట గుండం చెరువు తూములు మరమ్మతులకు నోచుకోక తూము లీకేజీ కారణంగా సాగు నీరు సుమారు పది వ్యవసాయ మోటర్ల వరకు వృథాగా పోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తపరిచారు. మండలంలో అతి పెద్ద చెరువు గుండం చెరువు కింద సుమారుగా 400 ఎకరాల వరి పంట సాగవుతుంది. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువు మత్తడిపోయాలి. తూములకు పడిన గండ్ల వలన చెరువు మత్తడి పడలేదని రైతులు ఆవేదన వెల్లబుచ్చారు. చెరువు ఒక్కసారి నిండితే రెండు పంటలు పండుతాయి. ఈ విధంగా సాగు నీరు వృథాపోతే, చెరువుల కింద సాగు చేసిన పంటలకు నీరు అందక, పంటలు పండని పరిస్థితి ఏర్పడుతుందని రైతులు తెలుపుతున్నారు.

అధికారులకు తెలిపినా.. పట్టించుకోవడంలేదు



కొడెం రమేశ్, రైతు, అడవిరంగాపురం

అడవిరంగాపురంలోని ఊర చెరువు తూము మరమ్మతుపై పలు సార్లు అధికారులకు తెలిపాం. ఏవరూ పట్టించుకోకపోవడంతో వర్షానికి చెరువులోకి చేరిన నీరు తూము లీకేజీతో వృథాగా పోతున్నాయి. ఈవిధంగా నీరు వృథాగా పోతే పంటలకు సాగు నీరు అందడం కష్టం. అధికారులు స్పందించి తూముల మరమ్మతులు చేపట్టి వృథాగా పోతున్న సాగు నీరు ఆపాలి.

కొరవడిన పర్యవేక్షణ

చెరువుల తూములు మరమ్మతులకు నోచుకోకపోవడంతోపాటు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో శిథిలావస్థలో ఉండిపోయాయి. మండలంలో 14 ఐబీ చెరువులు, 36 పంచాయతీ రాజ్ చెరువులు ఉన్నాయి. గతంలో ఐబీ చెరువులకు సాగు నీటి సంఘాల చైర్మన్లు ఉండేవారు. పది ఏళ్ల నుంచి సాగు నీటి సంఘాలు లేకుండా పోయాయి. దీంతో చెరువులపై నిఘా లోపించి బాగోగులు చూసే వారే కరువయ్యారు. చెరువుల తూములు లీకేజీ కావడంతో చెరువులకు చేరిన నీరు వృథాగా పోతోంది.

ద్విచక్ర వాహనం అపహరణ

వర్ధన్నపేట, ఆగస్టు 10 : ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైన సంఘటన వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు జి. భగత్‌సింగ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వర్ధన్నపేట ప్రాంతానికి చెందిన భగత్‌సింగ్ తొర్రూరుకు యూనికాన్ ద్విచక్రవాహనంపై ప్రతిరోజు విధులకు వెళ్లేవాడు. ఇదే క్రమంలో శుక్రవారం తొర్రూరులో విధులు ముగించుకొని రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటి ఆవరణలో పార్కు చేశాడు. శనివారం ఉదయం సుమారు 7.30 గంటల ప్రాంతంలో డ్యూటీకి వెళ్లేందుకు సమాయత్తం అవుతుండగా ఏపీ 36 ఏడీ 1597 ద్విచక్ర వాహనం కనిపించలేదు. ఇంటి పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ కనిపించలేదు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అపహరించు కెళ్లినట్లు వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో భగత్‌సింగ్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనాపురంలో పత్తి పంట ధ్వంసం



ధ్వంసం చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న పోలీసులు

చెన్నారావుపేట, ఆగస్టు 10 : మండలంలోని కోనాపురంలో భూ తగాదాలతో పత్తి పంటను ధ్వంసం చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది బాధితుడి కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన నాగబోయిన కైలాసం తన 2 ఎకరాల 20 గుంటల భూమిలో పత్తిపంట సాగుచేస్తున్నాడు. గీసుగొండ మండలం శాయంపేటకు చెందిన గాదం అరుణతో కొంతకాలంగా భూ తగాదాలు జరుగుతున్నాయి. అరుణ తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి శుక్రవారం రాత్రి సమయంలో ధ్వంసం చేశారు. ఇప్పుడే కాకుండా గత నెల 19న రాత్రి సమయంలోను కొంత మేరకు పత్తి పంటను, వరినారు ధ్వంసం చేశారు. విద్యుత్ మోటారును సైతం బావిలో పడేసి వెళ్లారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, మళ్లీ శుక్రవారం రాత్రి అరుణ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి కాత, పూత దశలో ఉన్న పత్తి పంటను, వరి నారును ధ్వంసంచేయడంతో సుమారు రూ.80 వేల వరకు నష్టం జరిగింది. పంట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని నర్సంపేట ఏసీపీకి బాధితుడు ఫిర్యాదు చేశాడు.

ప్రజా కళాకారులకు కల్చరల్ గుర్తింపు కార్డులు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

నర్సంపేట, ఆగస్టు 10 : ప్రజా కళాకారులకు కల్చరల్ గుర్తింపు కార్డులు అందించాలని తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దమెర కృష్ణ డిమాండ్‌చేశారు. పట్టణంలో శనివారం ఐత శ్రీలత అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా కళాకారులకు హెల్త్ కార్డులు అందించడంతో పాటు ఆర్టీసి బస్సుల్లో, రైళ్ళలో రాయితీలు కల్పించాలన్నారు. వృద్ధ కళాకారులకు రూ.6వేల పింఛన్ అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి జిలా గౌరవ అధ్యక్షుడు గన్నారం రమేశ్, బీకేఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపల్లి రమేశ్, మియాపురం గోవర్ధన్, ప్రజా నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సుప్రియ, అముదాల సుమలత. పాలక కవిత. స్వప్న, హంస మంజుల, బొళ్ళ హరిత, రాధిక. స్వరూప, ఎల్లాపురం భవాని, శనిగరపు రమ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ మృతిపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న కుమార్

పర్వతగిరి, ఆగస్టు 10 : మండల కేంద్రానికి చెందిన కొల్లూరి రేవంత్‌కుమార్ హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని, అతని తండ్రి కొల్లూరి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపించాలని రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్, అంబేడ్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బీరు కుమార స్వామి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ జూన్ నెల 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, సుమారు 20 రోజుల పాటు చికిత్స అనంతరం రేవంత్ కుమార్ మృతి చెందాడని, మృతుని కుటుంబానికి పోలీసులు సహకరించ డంలేదని మండిపడ్డారు. వెంటనే సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వృద్ధాప్యంలో వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వృద్ధులకు మందులు అందిస్తున్న వైద్యులు

సంగెం, ఆగస్టు 10 : వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని రాంచంద్రాపురం ఆయుర్వేద వైద్యుడు రాజేందర్ సూచించారు. శనివారం గ్రామంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు క్రాంతికుమార్, దిలీప్‌రావు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు అడ్వకేట్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



లూత్రను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గీసుగొండ, ఆగస్టు 10 : ఎస్సీల వర్గీకరణ కోసం సుప్రీంకోర్టులో వాదించటానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అడ్వకేట్ సిద్దార్థలూత్రను ఎమ్మార్పీఎస్ నాయకులు ఢిల్లీలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితోపాటు ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పు ఇవ్వడంలో సిద్దార్థలూత్ర కీలకపాత్ర పోషించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య తెలిపారు. లూత్రను కలిసిన వారిలో దళిత రత్న కేదాసి మోహన్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్ ఉన్నారు.

'ప్రభుత్వం పెండింగ్ పనులను పూర్తిచేయాలి'

నల్లబెల్లి, ఆగస్టు 10 : మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కాంగ్రె స్ ప్రభుత్వం పూర్తిచేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోతు సారంగ పాణి ఓ ప్రకటనలో అన్నారు. నాగరాజుపల్లి నుంచి మేడపల్లి వరకు బీటీ రోడ్డును త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కృషితో ప్రభుత్వానికి నాడు యశోద ఆస్పత్రి యాజమాన్యం మేడపల్లిలో 10ఎకరాలను భూమిని ప్రభుత్వానికి దారాతత్తం చేశారని, ఆ భూమిలో మంజూరైన మహాత్మా జ్యోతి రావు పూలే గురుకుల విద్యాలయానికి సొంత భవనాన్ని నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

పది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

చెన్నారావుపేట, ఆగస్టు 10 : మండలంలోని జల్లిలో పది మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తులు గ్రామ శివారులోని చెరువు కట్టపై పేకాట ఆడుతున్నారన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పేకాట ఆడుతున్న స్థలానికి చేరుకొని వారిని అదుపులోనికి తీసుకొని, వారివద్ద నుంచి రూ.4,420 నగదును స్వాధీనం చేసుకొని, పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 10 : ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు, త్వరగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఇంతేజార్‌గంజ్ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం. భూపాలపల్లికి చెందిన గాదె శ్రీనివాస్ అనే వ్యక్తి హనుమకొండలో నివాసం ఉంటున్నాడు. డిగ్రీ వరకు చదివిన శ్రీనివాస్, ఎలాంటి ఉపాధి లభించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దాంతో ఒరిస్సా బార్డ ర్ సీలేరు ప్రాంతం నుంచి గంజాయిని అపరిచిత వ్యక్తి ద్వారా తీసుకొచ్చి వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.33,250 విలువైన 1350గ్రాముల గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. దాంతో శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు.

పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మట్టసుజాత రాజు దంపతులు

దుగ్గొండి, ఆగస్టు 10 : మండలంలోని నాచినపల్లిలో పోచమ్మ దేవాలయం నిర్మాణ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయ నిర్మాణ దాత మట్ట సుజాత రాజు దంపతుల ఆధ్వర్యంలో కలశపూజ. చండి యాగం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రమేశ్‌మూర్తి, సాగరశాస్త్రి, నాగేందర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బుక్‌స్టాల్‌లో రెండోసారి చోరీ

కరీమాబాద్, ఆగస్టు 10: ఫోర్ట్‌రోడ్‌లోని శ్రీనివాస బుక్ స్టాల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి మరోసారి చోరీకి పాల్పడ్డారు. 7న అర్ధరాత్రి ఇదే బుక్‌స్టాల్‌లో షట్టర్ తాళాలు పగులగొట్టి కౌంటర్‌లోని రూ. 1.90 లక్షల నగదును అపహరించగా, తాజాగా మరోసారి చోరీ జరిగింది. గురువారం కేసు నమోదు చేసి, విచారణ చేపడుతుండగానే శుక్రవారం అర్ధరాత్రి మరోసారి అదే తరహాలో చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఫోరెన్సిక్ బృందంచే వేలిముద్రలు సేకరించారు. కాగా, షాపులో ఎలాంటి నగదు, వస్తువులు అపహరణకు గురికాలేదు. కాగా ఇటీవలే ఇదే ప్రాంతంలోని వజ్ర వైన్స్‌లో చోరీకి పాల్పడిన దుండగులు మరుసటి రోజే శ్రీనివాస బుక్‌స్టాల్‌లో రెండోసారి చోరీకి పాల్పడటంతో పోలీసులకు సవాల్‌గా మారింది.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, ఆగస్టు 10: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని గర్మిళ్లపల్లి ఆకేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా వనమాల కనపర్తి గ్రామ శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణం చేపట్టాలి



నినాదాలు చేస్తున్న గిరిజన నాయకులు

సంగెం, ఆగస్టు 10 : సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవు ప్రకటించాలని తెలంగాణ గిరిజన జన సమితి ప్రధాన కార్యదర్శి సపావట్ మహేందర్ నాయక్ డిమాండ్ చేశారు. సంగెంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సేవాలాల్ ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించి భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో లంబాడీలకు చోటు కలిపించాలని, ప్రతీయేటా తీజ్ పండుగను ప్రభుత్వ ఖర్చులతో నిర్వహించా లని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బానోత వెంకటేష్‌నాయక్, మూడు సుమన్‌నాయక్, నవీన్‌నాయక్, వినోద్‌నాయక్, సంతోష్‌నాయక్, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా సఖీ కేంద్రాలు



181 హెల్ప్‌లైన్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళలు

గీసుగొండ, ఆగస్టు 10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న సఖీ కేంద్రాలు మహిళలకు అండగా నిలుస్తున్నా యని సఖీ సెంటర్ ప్రతినిధి తిరుమల అన్నారు. మండలంలోని దస్రుతండా, మచ్చాపూర్ గ్రామాల్లో సఖీ సేవలపై మహిళలకు అవగాహన సమావేశాలను శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలిక సం రక్షణ చట్టాలు, న్యాయ సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక వసతి ఉచితంగా అందించేందుకు 24 గంటలు సఖీ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. అన్యాయానికి గురయ్యే మహిళలు హెల్ప్‌లైన్ 181కు ఫోన్‌చేయాలని సూచించారు. అనంతరం 181సేవల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీపీవోలు నిర్మల, అమృత, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మచ్చాపూర్‌లో జరిగిన బాలల రక్షణ చట్టాల సదస్సులో ప్రగతి పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విజయ్ కమార్, ప్రాజెక్టు మేనేజర్ కవిరాజ్ పాల్గొన్నారు.

కారు బోల్తా, ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 10 : ప్రమాదవశాత్తు కారు బోల్తాపడి ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని కొత్తపెల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వర్ధన్నపేట నుంచి కొత్తపెల్లికి వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న ఆకేరు వాగును అనుకుని ఉన్న వ్యవసాయ క్షేత్రంలో ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌తో పాటు మరో యువకుడికి గాయాలయ్యాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి, ఆగస్టు 10 : మండలంలోని గట్టికల్లు గ్రామానికి చెందిన కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు ఊగా మునిత తండ్రి నరసింహుల సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం దశదిన కర్మ సం దర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. వీరి వెంట నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డి, నీలయ్య, నర్సయ్య నర్సింహమూర్తి, సంతోష్, ప్రవీణ్, రామ్మూర్తి ఉన్నారు.

సైడ్ కాల్వల నిర్మాణం ప్రారంభం



సైడ్ కాల్వల నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న వీరన్న

చెన్నారావుపేట, ఆగస్టు 10 : మండలంలోని కాల్‌నాయక్‌తండాలో సైడ్ కాల్వల నిర్మాణ పనులను మాజీ సర్పంచ్ రజిత భర్త, బీఆర్ఎస్ నాయకుడు వీరన్న శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జడ్పీటీసీ నిధులు రూ.2.50 లక్షలతో సైడ్ కాల్వ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో రవి, యాకుబ్, భద్రు, బిక్కు, గోవింద్, లావుడ్య బిక్కు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.